## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక








కర్నూలు సంపుటి : 03 సంచిక : 358 మంగళవారం, 02-04-2024 పేజీలు :04 వెల:రూ.2.00


## భారత్ ఆర్థికంగా స్వయం సమృద్ధి కావాలి: ప్రధాని మోదీ



ముంబై: రాబోయే పదేళ్లలో దేశం ఆర్థికంగా స్వయం సమృద్ధి కావాలని ప్రధాని మోదీ(ఖఓ ఓనీటతి) ఆకాంక్షించారు. ఎందుకంటే ప్రపంచ దేశాల ప్రభావం భారత్‌పై పడకుండా ఉంటుందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడవ సారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు ఏర్పడిన తర్వాత ప్రతి ఒక్కరికీ కావాల్సినంత పని దొరుకుతుందని అన్నారు. భారత స్వయంసమృద్ధి సత్తాను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకింగ్ రంగం లాభదాయకంగా మారిందన్నారు. గత పదేళ్లలో ప్రభుత్వం, ఆర్బీఐ తీసుకున్న చర్యల వల్ల క్రెడిట్ గ్రోత్ జరుగుతోందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 2018లో 11.25 శాతంగా ఉన్న ఎన్పీఏలు, 2023 సెప్టెంబర్ నాటికి మూడు శాతానికి పడిపోయినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం బ్యాంకుల్లో 15 శాతం క్రెడిట్ గ్రోత్ నమోదు అవుతోందన్నారు. ఈ ప్రగతిలో ఆర్బీఐ కీలక పాత్ర పోషించినట్లు ప్రధాని మోదీ ప్రశంసించారు.

## ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్

### పంటల బీమా అమలు చేయని ఏకైక రాష్ట్రం తెలంగాణ
### అబద్దాలతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లిన కెసిఆర్
### కరువు వచ్చిందే బిఆర్ఎస్ పాలనలోనే అన్న ఉత్తమ్



హైదరాబాద్,ఏప్రిల్1 : కెసిఆర్ హయాంలో ఇరిగేషన్ రంగం సర్వనాశనం అయ్యిందనిమాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ రంగంలో కేసీఆర్ చేసిన దోపిడీ దేశంలో ఎవరూ చేయలేదన్నారు. జనగామ, సూర్యపేట జిల్లాలో కేసీఆర్ పర్యటించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్ ఇచ్చారు. నిన్న కేసీఆర్ అన్ని అబద్దాలే మాట్లాడారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు. పోలీస్ శాఖను ఎక్కువ మిస్ యూజ్ చేసింది కేసీఆరే అని విమర్శించారు. పోలీసులు న్యూట్రల్‌గా ఉండాలని ఇప్పుడు కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కరువు వచ్చింది బీఆర్ఎస్ పాలనలోనే అని... దాన్ని సమర్ధవంతంగా డీల్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రైతులకు పంట బీమా కల్పించలేదని.. .దేశంలో పంట బీమా కల్పించని ఏకైక సర్కార్ బీఆర్ఎస్ దేనని విమర్శించారు. వరదలు, కరువుతో పంట నష్టపోతే.. ఒకటి రెండు చోట్లకు వెళ్లి కేసీఆర్ డ్రామా చేశాడని.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. మైక్ పనిచేయకుంటే కరెంట్ పోయిందంటూ కేసీఆర్ అబద్దాలు మాట్లాడారని.. పవర్ విషయంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. 24 గంటల పవర్ పాలసీని కొనసాగిస్తున్నాం.. రాష్ట్రంలో పవర్ కట్స్ లేవని స్పష్టం చేశారు.కాళేశ్వరం గురించి మాట్లాడటానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. తలదించుకోవాలి.. ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరంలో కమిషన్ల కోసం అంచనాలు పెంచారని చెప్పారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిందే కేసీఆర్ అని నిప్పులు చెరిగారు. కేసీఆర్, జగన్ దోస్తీతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. కృష్ణా నుంచి జగన్ అక్రమంగా నీళ్లను తరలిస్తున్నా కేసీఆర్ నోరు మెదపలేదని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే ఏపీకి ఎక్కువ నీళ్లు తరలి వెళ్లాయన్నారు. కేసీఆర్ భయాందోళనలో ఉన్నాడు.. అందుకే పొలం బాట పట్టారని చెప్పారు. కేసీఆర్ పొంకనాలకు పోయి పార్టీని నాశనం చేశాడని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలోనే కుప్పకూలిందని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇన్ని మాటలు మాట్లాడుతున్న కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు పంట బీమా ఎందుకు కల్పించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగారు. దేశంలో పంట బీమా కల్పించని ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్సేనని ధ్వజమెత్తారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బిఆర్ఎస్ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు. 24 గంటల పవర్ పాలసీ కొనసాగిస్తున్నామని, నిమిషం పవర్ కట్స్ ఎక్కడా లేవన్నారు. తెలంగాణ రైతాంగం, ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసి వ్యక్తి కెసిఆర్ అని, అందుకు ఆయన సిగ్గుపడాలి, తలదించుకోవాలి, తెలంగాణ జనాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రంగాన్ని కెసిఆర్ నాశనం చేయడంతో పాటు దోపిడీ చేశారని ఆరోపణలు చేశారు. కాళేశ్వరం గురించి మాట్లాడేందుకు కెసిఆర్‌కు సిగ్గుండాలని, కాళేశ్వరంలో కమీషన్ల కోసం అంచనాలు పెంచారని, కళ్ల ముందే కాళేశ్వరం కుంగినా మాట్లాడటం మూర్ఖత్వం కిందకు వస్తుందని ఉత్తమ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్దమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు. పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇరిగేషన్‌పై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్తామని బీఆర్ఎస్ చీఫ్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ – జగన్ కలిసి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలపై కుట్ర చేశారని ఆరోపించారు.

## కాకతీయ తోరణాన్ని ముట్టుకుంటే వరంగల్ జిల్లా అగ్నిగుండమే : హరీశ్‌రావు

వరంగల్ : సీఎం రేవంత్ సర్కార్ కాకతీయ తోరణాన్ని ముట్టుకుంటే వరంగల్ జిల్లా అగ్నిగుండం అవుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. కాకతీయ తోరణం వరంగల్ జిల్లా ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని హరీశ్‌రావు పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.వరంగల్‌లో వెయ్యి పడకల ఆస్పత్రికి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మహబూబాబాద్, జనగామ, ములుగు, నర్సంపేట, భూపాలపల్లికి మెడికల్ కాలేజీలు ఇచ్చింది కేసీఆర్ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. అంతేకాకుండా వరంగల్ జిల్లాకు టెక్స్ టైల్ పార్కు, వెటర్నరీ యూనివర్సిటీ ఇచ్చాం. ఇవాళ రేవంత్ తెలంగాణ చిహ్నంలోని కాకతీయ తోరణం తీసేస్తా అంటున్నాడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని అంటున్నాడు. కాకతీయ తోరణాన్ని ముట్టుకుంటే వరంగల్ జిల్లా అగ్ని గుండం అవుతుంది. కాకతీయ తోరణం వరంగల్ జిల్లా ప్రజల ఆత్మగౌరవ ప్రతీక. ఒక వేళ ఆ చిహ్నంలో కాకతీయ తోరణం తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ నామరూపాల్లేకుండా భూస్థాపితం చేస్తారు వరంగల్ జిల్లా ప్రజలు. రేవంత్ రెడ్డి ఏదో ఒక రకంగా కేసీఆర్ మీద అపవాదులు వేయాలని చూస్తున్నారు అని హరీశ్‌రావు తెలిపారు. ఈ వంద రోజుల్లో ఉద్దెర మాటలే తప్ప ఉద్దరించింది ఏం లేదు..కాంగ్రెస్ నాయకులు ఏదో ఉద్దరిస్తారు అనుకున్నారు.. కానీ అన్నీ ఉద్దెర మాటలే అన్నది ప్రజలు గుర్తించారు.



ఈ వంద రోజుల్లో ఉద్దెర మాటలే తప్ప ఉద్దరించింది ఏం లేదు. అన్నీ ఫేక్, లీక్ వార్తలే. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. హామీలు అమలు కాలేదు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు కోపంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజస్వరూపం ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. మనం ప్రజలకు వద్దకు వెళ్లి వివరించాలి. నిన్న కేసీఆర్‌కు అద్భుతమైన ప్రజాస్పందన లభించింది. కడియం లాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, వారికి పార్టీ అండగా ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## ఎట్రోల్, డీజిల్ కార్లను వదిలించుకోవడం సాధ్యమే..! కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ..

భారతదేశాన్ని గ్రీన్ ఎకనామీగా మార్చడంలో భాగంగా హైబ్రిడ్ వాహనాలపై జీఎస్టీని తగ్గించి.. 36కోట్లకుపైగా పెట్రోల్, డీజిల్ వాహనాలను వదిలించుకోవాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పెట్రోల్, డీజిల్ కార్లను పూర్తిగా వదిలించుకోవడం భారత్‌కు సాధ్యమేనా?



అనే ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. 'వందశాతం. అసాధ్యం కాదు. ఇది నా అభిప్రాయం' అని జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇంధన దిగుమతులపై భారతదేశం రూ.16 లక్షల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ సొమ్ముతో రైతుల జీవితాలు బాగుపడుతాయని.. గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, యువతకు ఉపాధి లభిస్తుందని గడ్కరీ పేర్కొన్నాం హైబ్రిడ్ వాహనాలపై జీఎస్టీని ఐదు శాతానికి, ఫ్లెక్స్ ఇంజిన్లపై 12 శాతానికి తగ్గించే ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపామని, ఈ డిమాండ్‌ను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. జీవ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశం ఇంధన దిగుమతులను తగ్గించగలదని తాను బలంగా నమ్ముతున్నానన్నారు. తాను 2004 నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టి పెడుతున్నానని, రానున్న ఐదు నుంచి ఏడేళ్లలో పరిస్థితులు మారతాయని గడ్కరీ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ మార్పును ఎప్పటిలోగా తీసుకువస్తామో చెప్పలేనన్నారు. ఎందుకంటే ఇది చాలా కష్టంతో కూడకున్నదని.. కానీ అసాధ్యం మాత్రం కాదని గడ్కరీ స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలు ఎంత వేగంతో ప్రవేశపెడుతున్నాయో.. రాబోయే కాలంలో ప్రత్యామ్నాయ, జీవ ఇంధనాలు అందుబాటులోకి వస్తాయని, ఈ కల నిజమవుతుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. బజాజ్, టీవీఎస్, హీరో వంటి ఆటో కంపెనీలు కూడా ఫ్లెక్స్ ఇంజిన్లను ఉపయోగించి మోటార్‌సైకిళ్లను తయారు చేయాలని యోచిస్తున్నాయని గడ్కరీ తెలిపారు.

## తీహార్ జైలుకు కేజ్రీవాల్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 ,ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టైన సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టులో మరో షాక్ తగిలింది. ఆయన్ని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించేందుకు కోర్టు ఓకే చెప్పింది. దీంతో ఆయన్ని కోర్టుకు తరలించారు. కోర్టు ఆదేశాల మంరకు 15 రోజుల పాటు తిహార్ జైలులో ఉండబోతున్నారు. ఇప్పటికే ఇదే కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అక్కడే ఉన్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం కూడా అదే జైల్లో ఉన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో అరవింద్ కేజ్రీవాల్ మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు మార్చి 21 రాత్రి అరెస్టు చేశారు. 22న కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఈడీ కస్టడీకి ఇవ్వడంతో ఏడు రోజుల పాటు విచారించారు. విచారణ గడువు పూర్తి కావడంతో ఇవాళ కోర్టులో హాజరుపరిచారు. 28న విచారణ గడువు ముగిసినప్పటికీ కోర్టుకు సెలవులు కారణంగా ఇవాళ హాజరుపరిచారు. కోర్టులో హాజరుపరిచిన సందర్భంగా ఈడీ తరపున ఎస్వీ రాజు వాదిస్తూ... విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని కోర్టుకు తెలిపారు. ఆయన్ని మరోసారి కస్టడీకి ఇవ్వాలని రిక్వెస్ట్ పెట్టారు. కోర్టులో హాజరుపరిచిన సందర్భంగా ఈడీ తరఫున ఎస్వీ రాజు వాదిస్తూ... విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని కోర్టుకు తెలిపారు. ఆయన్ని మరోసారి కస్టడీకి ఇవ్వాలని రిక్వెస్ట్ పెట్టారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ముఖ్యమంత్రి కేజ్రీవాల్

ప్రధాన సూత్రధారిగా

ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఈ కేసులో అరెస్టు అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కవిత, మాజీ డిప్యూటీ సీఎంలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ జైలులో ఉన్నారు. ఈ స్కామ్‌లోని డబ్బులనే ఆమ్ ఆద్మీ పార్టీ గోవా ఎన్నికల్లో వినియోగించినట్టు చెబుతోంది. దర్యాప్తు సంస్థ చేస్తున్నఆరోపణలు కేజ్రీవాల్ సహా ఆప్ నేతలు ఖండిస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయకుండా ఉండేందుకే కేంద్రం కక్ష పూరితంగా కేసులు పెట్టి వేధిస్తోందని ?ంటున్నారు.

## రుణమాఫీ అయితే కాంగ్రెస్ కు ఓటు వేయండి? లేకపోతే మాకు వేయండి: కెటిఆర్

హైదరాబాద్: బిఆర్ఎస్ కార్యకర్తలు ఉత్సహం చూస్తే ఎందుకు ఓడిపోయామో అర్థం కావడంలేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. నల్లగొండలో జరిగిన సభలో కెటిఆర్ మాట్లాడారు. మనది పదేళ్ల నిజం అని, కాంగ్రెస్‌ది వంద రోజుల అబద్ధమని మండిపడ్డారు. రైతులకు 24 గంటలు రైతులకు కరెంటు, చివరి ఆయకట్టుకు నీళ్లిచ్చిన నాయకుడు కెసిఆర్ అని ప్రశంసించారు. నల్లగొండలో ఫ్లోరైడ్‌ని పెంచిందే కాంగ్రెస్ అని, ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టింది కెసిఆర్ కాదా? అని ప్రజలను కెటిఆర్ అడిగారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యి గురుకుల పాఠశాలలు పెట్టిందని, ఇవన్నీ ప్రజలకు చెప్పడంతో మన విఫలమయ్యామని, తప్పు ప్రజలది కాదని, మనదేనని, కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలు విని ప్రజలు మోసపోయారన్నారు. ఇవాళ ప్రజలు, రైతులు బాధ పడుతుంటే చూడలేకపోతు?న్నామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 1,60,283 ఉద్యోగాలు



ఇచ్చామని కెటిఆర్ స్పష్టం చేశారు. ఆ విషయాన్ని విద్యార్థులు, నిరుద్యోగులకు చెప్పడంలో తాము విఫలమయ్యామన్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసింది బిఆర్ఎస్సేనని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 30 వేల ఉద్యోగాలు ఇచ్చామంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని, నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వంద రోజుల్లోనే మోసపోయామని ప్రజలు గ్రహించారని, రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఇంకా ఎందుకు చేయలేదని కెటిఆర్ ప్రశ్నించారు. రుణమాఫీ జరిగి ఉంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సూచించారు.రుణమాఫీ రాక మోసపోయింటే బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమకు లేదని, నల్లగొండ, ఖమ్మం నేతలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తారని ఎద్దేవా చేశారు.

## బిజెపిని గెలిపించండి: కిషన్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కాంగ్రెస్ పాలనతో 10 ఏళ్ల మోడీ పాలనను పోల్చుకుని బిజెపికి ఓటేయాలని ఓటర్లను కోరారు. వారు పేదలకు బ్యాంకు ఖాతాలు ఎందుకు అని హేళన చేశారన్నారు. ప్రస్తుతం పేదలు దాదాపు రూ. 2 లక్షల కోట్లు పొదుపు చేశారు. గతంలో నిరర్ధక ఆస్తులు చాలా ఉండేవి. బిజెపి ప్రభుత్వం వచ్చాక 55 కోట్ల కొత్త బ్యాంకు ఖాతాలు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ హయాంలో ద్రవ్యోల్బణం 12 శాతానికి పైగా ఉండేది. మోడీ వచ్చాక 500 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించారన్నారు. మహిళలకు 33 శాతం కోటా ఇచ్చారని, హైవేలు నిర్మించారని, వ్యవసాయ వృద్ధికి సాయమందించారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని అన్నారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అనేక అంశాలపై మాట్లాడారు.

## ఏపి కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ఖరారు

### నేడు అధికారికంగా ప్రకటించే ఛాన్స్

న్యూఢిల్లీ,ఏప్రిల్1: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసినట్లు సమాచారం. 117 అసెంబ్లీ స్థానాలకు, 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించనున్నట్లు ఏపీ కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మల పేర్కొన్నారు. ఇక సీనియర్ నేత, మాజీ పీసీసీ రఘువీరా రెడ్డి ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నట్టు సమాచారం.

శ్రీ ప్రస్థానం

సంపాదకీయం

# అంతర్గత విషయాలపై ఉత్సాహమెందుకో

భారత అంతర్గత వ్యవహారాల్లో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుంది. ఇదివరకే కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా, జర్మనీ స్పందించిన విషయం తెల్సిందే. అమెరికా వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అమెరికా దౌత్యవేత్తకు భారత్ సమన్లు జారీ చేసింది. అది జరిగిన ఒక్క రోజు వ్యవధిలోనే కేజ్రీవాల్ అరెస్టుపై ఐక్యరాజ్యసమితి రియాక్ట్ అయ్యింది. భారత్‌లో లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న పరిణామాలపై ఐక్యరాజ్యసమితి అధికార ప్రతినిధి స్టెపాన్ దుజారిక్ స్పందించారు. కేజ్రీవాల్ అరెస్టు, ఐటీ శాఖ చేసిన కాంగ్రెస్ అకౌంట్స్ ఫ్రీజ్ తో నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై మాట్లాడారు. భారత్ తో పాటు ఎన్నికలు జరిగే ప్రతి దేశంలోనూ రాజకీయ, పౌర హక్కులు రక్షిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్వేచ్ఛ, న్యాయమైన వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు వేస్తారని నమ్ముతున్నామన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఇటీవల ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు అరెస్టు చేశారు. ఆయన ప్రస్తుతం ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల విచారణలో ఉన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం లో ఆయన కీలకపాత్ర పోషించారని, ఆయనకు వ్యతిరేకంగా తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పి ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు అరెస్టు చేశారు. అరవింద్ అరెస్టు నేపథ్యంలో ఆప్ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుపుతూనే ఉన్నారు.. ఇదంతా ఇలా జరుగుతుండగానే.. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా, జర్మనీ దేశాలు స్పందించాయి. అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మాథ్యు మిల్లర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై స్పందించారు. "కేజ్రీవాల్ అరెస్టు వ్యవహారంతో పాటు ఇలాంటి చర్యలను తాము జాగ్రత్తగా పరిశీలిస్తూనే ఉంటామని" మిల్లర్ అన్నారు. "ఐటీ శాఖ కాంగ్రెస్ పార్టీ ఖాతాలను స్తంభింపజేస్తుందని మా దృష్టికి వచ్చింది. దీనివల్ల రాబోయే ఎన్నికల్లో ప్రచారం చేయడం ఇబ్బందికరంగా మారిందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు కూడా మా దాకా వినవచ్చాయి. ఇందులోని ప్రతి అంశం గురించి పారదర్శకంగా, సకాలంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. అటువంటి చట్టపరమైన ప్రక్రియల వేగిరంలో మేము కృషి చేస్తామంటూ" మిల్లర్ ప్రకటించారు. మిల్లర్ వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ లోని అమెరికా దౌత్యవేత్త గ్లోరియా బార్బెనా కు భారత్ సమన్లు జారీ చేసింది. దీనిపై మిల్లర్ స్పందించారు. "ఇక్కడ నేను ప్రైవేట్ వ్యవహారాల గురించి మాట్లాడటం లేదు. ఆ దేశంలో జరుగుతున్న విషయాలను నేను ప్రస్తావించాను. చట్టపరమైన ప్రక్రియలను ప్రోత్సహించేందుకు మా వంతు సహాయం చేస్తామని చెబుతున్నామని" మిల్లర్ అన్నారు. మిల్లర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అమెరికా దౌత్యవేత్త ఎదుట భారత్ తన వాదన వినిపించింది. దీనికి సంబంధించి గంటకు పైగా సమావేశం జరిగింది. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై జర్మనీ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ని.. కొంతమంది మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఆయన సమాధానాలు చెప్పడానికి నిరాకరించారు.."అరెస్టుపై ఇప్పటికే మేము స్పందించాం. దీనికి సంబంధించి రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. అయితే ఆ వివరాలు బయటకు చెప్పడం సాధ్యం కాదు. భారతదేశంలో రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కులు అమలవుతున్నాయి. అక్కడ పౌరులకు స్వేచ్ఛ లభిస్తోంది. భారతదేశంలో మేము వ్యూహాత్మక వ్యాపార భాగస్వామిగా ఉన్నాం. భారతదేశం విలువలకు కట్టుబడి ఉంటుందని మేము నమ్ముతున్నామని" జర్మనీ విదేశాంగ ప్రతినిధి ప్రకటించారు. జర్మనీ విదేశాంగ ప్రతినిధి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆ దేశ ఎంబసీ డిప్యూటీ చీఫ్ జార్జ్ ఎన్జ్వీలర్ కు భారత ప్రభుత్వం సమన్లు జారీ చేసింది. విదేశాంగ ప్రతినిధి వ్యాఖ్యల పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిందిఅటు అమెరికా, ఇటు జర్మనీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ స్పందించింది. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై రెండు దేశాల విదేశాంగ ప్రతినిధులు చేసిన వ్యాఖ్యల పట్ల భారత్ నిరసన వ్యక్తం చేసింది."ఒక దేశ దౌత్య నీతిలో మరో దేశం తలదూర్చడం సరికాదు. అంతర్గత వ్యవహారాలను కచ్చితంగా గౌరవించాలి. భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం. కచ్చితంగా ఇక్కడ అన్ని హక్కులు అమలవుతుంటాయి. అనేక ప్రజాస్వామ్య ప్రక్రియలు కొనసాగుతుంటాయి. ఇక్కడి న్యాయ వ్యవస్థ కూడా చాలా దృఢమైనది. అందులో అను నిర్ణయాలు నిబంధనలకు లోబడే జరుగుతుంటాయి. వీటన్నింటినీ కొన్ని దేశాలు ప్రశ్నించడం దురదృష్టకరమని" భారతదేశ విదేశాంగశాఖ ప్రకటించింది.. భారత విదేశాంగ శాఖ ప్రకటన తర్వాత జర్మనీ కాస్త వెనక్కి తగ్గింది.

# కరీంనగర్ లో నీటి కష్టాలు



కరీంనగర్, ఏప్రిల్ 1, (న్యూస్ పల్స్)ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రోజురోజుకి సాగునీటి కష్టాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు వరిపంట చేతికి వచ్చే సమయంలో నీరులేక పంటలు ఎండిపోతున్నాయి. మరో పది రోజులు అయితే పంటంతా చేతికి వచ్చేది. కానీ..ఒకేసారి భూగర్భ జలాలు అడుగంటి పోయాయిఓ వైపు తీవ్రమైన ఎండలు.. మరోవైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు, డెడ్ స్టోరేజికి చేరుకున్న ప్రధాన ప్రాజెక్టులు,చేతికి వచ్చిన పంటలన్ని కళ్ళముందు ఎండిపోతుండడం తో రైతులు తట్టుకోవడం లేదు. చివరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పంటని కాపాడుకునే చివరి ప్రయత్నం చేస్తున్నారు అన్నదాతలు..తెలంగాణ కు వరప్రదాయినైన ఎల్లంపల్లి జలాశయం భానుడి భగభగలకు ఆవిరవుతోంది. ఎత్తిపోతలు లేక కాళేశ్వరం జలాలు తిరిగొచ్చే దారిలేక.. దిగువ ప్రాంతాలకు తాగునీళ్లు ఇవ్వలేనంటూ చేతులెత్తేస్తోంది. మరో వైపు ప్రాజెక్ట్ లో నీటి నిల్వలు భారీగా పడిపోతుండటంతో సాగునీటి గండాన్ని మోసుకొస్తోంది. కడెం ఇప్పటికే డెడ్ స్టోరేజీకి చేరువైంది. ఇంకో వైపు ఎండి ఎడారిగా మారుతున్న ఎల్లంపల్లి..రాబోయే తాగునీటి కటకటకు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. 6 జిల్లాలకు తాగు నీటి ఇబ్బందులు తప్పవంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రోజురోజుకి సాగునీటి కష్టాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు వరిపంట చేతికి వచ్చే సమయంలో నీరులేక పంటలు ఎండిపోతున్నాయి. మరో పది రోజులు అయితే పంటంతా చేతికి వచ్చేది. కానీ..ఒకేసారి భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీనితో బావులు, బోరులు ఎండిపోతున్నాయి. అదే విధంగా అయకట్టు కూడ సరిగా కెనాల్‌లో నీరు రావడం లేదు. ఈ క్రమంలో పదిహేను రోజుల నుంచి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా మొగ్దుంపూర్, దుర్శేడ్ గ్రామాలైతే నీరు ఉన్న చోటు నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. అదే విధంగా వరద కాలువ సమీపంలో సాగుచేస్తున్న పంటలకు సరిగా సాగునీరు రావడంలేదని రైతులు రోడ్లేక్కుతున్నారు రైతులు. కేవలం రెండు తడులు అయితే పంటలు చేతికి వస్తాయని రైతులు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. హైదరాబాద్ లో నీటి కొరతనగరంలోని భూగర్భ జలాలు అడుగంటిపోయి. ట్యాంకర్లకు

విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒకటి రెండు షిఫ్టులలో సరఫరా సరిపోవట్లేదు. ఈ నేపథ్యంలో జలమండలి సమస్య నివారణ చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే కొత్తగా 20 ఫిల్లింగ్ స్టేషన్లు , మూడో షిఫ్ట్ ఏర్పాటు చేసింది. అదనపు ట్యాంకర్లు, డ్రైవర్లను సమకూర్చుకుంటున్నట్లు ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిశోర్ సూచన మేరకు జీహెచ్ఎంసీ నుంచి 200 మంది డ్రైవర్లను సమకూర్చు కుంటున్నామని.. దీనికి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ కూడా అంగీకరించినట్లు వెల్లడించారు. ఈ డ్రైవర్లకు నేడు జలమండలి ప్రధాన కార్యాలయంలో ఒక రోజు ఓరియెంటెషన్ ప్రోగ్రాం నిర్వహించారు. వీరంతా మూడో షిఫ్ట్ రాత్రి సమయాల్లో వాణిజ్య వినియోగదారులకు నీరు సరఫరా చేసేందుకు పనిచేయనున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మూడో షిఫ్ట్ ప్రారంభమైంది. కమర్షియల్ ట్యాంకర్లు బుక్ చేసుకున్న వినియోగదారులకు నీటి సరఫరా చేస్తున్నారు. నిన్న ఒక్కరోజే 800 ట్రిప్పులుగా ట్యాంకర్లతో నీరు అందించారు.

# రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలి

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

వెదురుగట్టలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం





కరీంనగర్ ఏప్రిల్ 1 :రైతులకు ఇబ్బందులు కలుగకుండా వరి ధాన్యం కొనుగోళు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. సోమవారం చొప్పదండి మండలం వెదురుగట్టలో శ్రీరామ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వరి ధాన్యం బస్తాను తూకం వేసి కొనుగోళ్లను లాంఛనంగా ప్రారంభించారు. ధాన్యం తేమ శాతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు యాసంగి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. వరి పంట దాదాపు కోతకు వచ్చిందని, కోసిన వెంటనే తేమ శాతాన్ని సరి చూసుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లోనే రైతులకు మద్దతు అందుతుందని పేర్కొన్నారు. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. నాణ్యత తో తీసుకువస్తేనే ధాన్యానికి మంచి ధర లభిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని

జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, డీసీఎస్ఓ గౌరీ శంకర్, సివిల్ సప్లై డిఎం రజనీకాంత్, అదనపు డిఆర్డిఓ సునీత, డిపిఎం ప్రవీణ్, ఏపీఎం నర్మదా, మండల వ్యవసాయ అధికారి వంశీ, సివిల్ సప్లైస్ డీటీలు ఉషా, కమలేశ్, అధికారులు,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ కోసం సకాలంలో ఫారం-12(డి) సమర్పించాలి

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్, ఏప్రిల్ 01 : పోస్టల్ బ్యాలెట్ కోసం అవకాశం కలిగి ఉండి, దానిని వినియోగించదల్చిన వారు ఈ నెల (ఏప్రిల్) 20 వ తేదీ లోపు నిర్ణీత ఫారం-12(డి) పూరించి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో కలెక్టర్ సోమవారం అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోందని అన్నారు. ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెసులుబాటు కల్పించిందని అన్నారు. అయితే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని నోడల్ అధికారులకు సూచించారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు సమర్పించే ఫారం -12(డీ)లను మాత్రమే పరిగణలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్ కు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఫారం -12 (డీ) దరఖాస్తులు నోడల్ అధికారి నుండి, లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల నుండి కూడా పొందవచ్చని, ఎలక్షన్ కమిషన్ పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆర్.ఓ కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ సెగ్మెంట్ కు చెందిన వారు నిజామాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆర్.ఓ ఆఫీసులో, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ వారు నిజామాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని వారు బాన్సువాడ ఆర్డీఓ ఆఫీస్ లో, బోధన్ సెగ్మెంట్ కు చెందిన వారు బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో, ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని వారు ఆర్మూర్ ఆర్డీఓ కార్యాలంలోని ఆర్.ఓ ఆఫీసులో, బాల్కొండ సెగ్మెంట్ కు చెందిన వారు భీంగల్ మండల కేంద్రంలోని ఎం.పీ.డీ.ఓ కార్యాలయంలో తమ పోస్టల్ బ్యాలెట్ ను వినోయోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవీసీ) అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ మే 13 న నిర్వహించే పోలింగ్‌రోజునపోలింగ్‌కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించబడదని, ఓటరు జాబితాలో వారి పేరును పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్ చేయబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి విజయేందర్ రెడ్డి, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సన్ డైరెక్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ




కామారెడ్డి ఏప్రిల్ 1 :మండుతున్న ఎండల నుండి ప్రజలకు ఉపశమనం కోసం కామారెడ్డిలో సోమవారం సన్ డైరెక్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. సన్ డైరెక్ట్ డిస్ట్రిబ్యూటర్ శ్రీ గజానన ఎలక్ట్రానిక్స్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ , వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్, ఏప్రిల్ 01 : డిచ్పల్లి మండలం యానంపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను



పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్ వెంట డీ.ఎస్.ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీశ్ తదితరులు ఉన్నారు.

# రైతులకు భరోసా కల్పించడం కోసమే కరీంనగర్లో రైతు దీక్ష...

మొదటి నుండి రైతుల కోసం కొట్లాడి రైతులకు అండగా ఉన్న పార్టీ బిజెపి...

బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ .

కరీంనగర్ ఏప్రిల్ 1 :రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులకు అండగా నిలవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తు , మొద్దు నిద్రలో ఉందని , ప్రభుత్వాన్ని మేల్కొల్పడానికి , రైతులకు భరోసా కల్పించడానికి మంగళవారం కరీంనగర్లో రైతు దీక్ష చేపడుతున్నట్లు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ తెలిపారు. సోమవారం కరీంనగర్ లోని శుభ మంగళ గార్డెన్లో ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన బాధ్యులకు తగిన దిశా నిర్దేశం చేశారు. అనంతరం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు.



మొదటినుండి రైతుల కొసం కొట్లాడి,రైతులకి అండగా ఉన్న పార్టీ బిజేపి అన్నారు. నాడు కెసిఆర్ రైతాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించి, వరి వేస్తే ఉరి , రైతులను గోస పెడితే ముందుండి కొట్లాడింది బిజేపి పార్టీని అని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ విధానాలనే అవలంబిస్తుందన్నారు. సాగునీళ్లు లేక రైతులు అల్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని, కరువు ఉందని కుంటిసాకులు చెప్పుకుంటూ తప్పించుకోవాలని చూస్తుందన్నారు. రైతుల కోసం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. రైతుల 2 లక్షల రుణమాఫీ , ఎకరాకు 15 వేల రైతుబంధు, కౌలు రైతులకు రైతుబంధు ఏమైందని ఆయన ప్రశ్నించారు. కుంటి సాకులు చెప్పకుండా , ఎన్నికలలో ఇచ్చిన హామీలని కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో కెసిఆర్ రామడుగు వచ్చి పంటనష్టం ఇస్తానన్న నేటి పంటనష్టం రాలేదని, కెసిఆర్ కి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని, కరీంనగర్ రైతులకి క్షమాపణ చెప్పిన తరువాతనే కరీంనగర్ లో కెసిఆర్ అడుగుపెట్టాలన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ బాధ్యులు పాల్గొన్నారు

# ఇంటి నుండి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఫారం 12-డీ పంపిణీ

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్, ఏప్రిల్ 01 : ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలలో 85 సంవత్సరాల వయస్సు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యంగులు ఇంటి వద్ద నుండే ఓటు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వారికి ఎలక్షన్ కమిషన్ ద్వారా నిర్దేశించబడిన నిర్ణీత ఫారం 12-డీ లను పంపిణీ చేయిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారులు ఓటరు జాబితాలో మార్కింగ్ చేయబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, దివ్యంగ ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఫారం 12-డీ అందజేస్తున్నారని అన్నారు. జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 7555 మంది ఉండగా, మార్చి 30 నాటికే 3331 మందికి ఫారం 12-డీ అందజేయడం పూర్తయ్యిందని వివరించారు. అదేవిధంగా దివ్యంగులైన ఓటర్లు 24229 మంది ఓటరు లిస్టులో మార్కింగ్ చేయబడి ఉండగా, వారిలో 10175 మందికి నిర్ణీత ఫారాలను సమకూర్చడం జరిగిందన్నారు. అర్హత కలిగి ఉన్న 85 ఏళ్ళు పైబడిన, దివ్యంగ ఓటర్లందరికి వారు ఇంటి నుండే ఓటు వేసేందుకు వీలుగా ఫారం 12-డీ అందజేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇంటి నుండి ఓటు వేయదల్చిన వారు తమ సమ్మతి తెలుపుతూ పూరించిన ఫారం 12-డీ ని ఈ నెల 20 వ తేదీ వరకు అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ, పోలింగ్ అధికారుల బృందాలు వారి ఇళ్లకు వెళ్లి పూర్తి పారదర్శకంగా వీడియో చిత్రీకరణ నడుమ ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తాయని, సీక్రెట్ ఓటింగ్ కోసం ఓటింగ్ కంపార్ట్ మెంట్ ను కూడా ఏర్పాటు చేస్తారని అన్నారు. కాగా, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే 13 శాఖల ఉద్యోగులకు సైతం పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటు కల్పించడం జరిగిందని, దీనిని వినియోగించదల్చిన వారు సైతం ఈ నెల 20వ తేదీ వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఫారం-12 (డి)లు అందించాలని కలెక్టర్ సూచించారు.

# సినీ ప్రస్థానం



# అల్లు అర్జున్-అట్లీ.. అసలు సమస్య ఇదే!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం పుష్ప-2 మూవీ షూటింగ్ లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల దుబాయ్ టుస్సాడ్స్ మ్యూజియంలో జరిగిన తన మైనపు విగ్రహ ఆవిష్కరణ వేడుకకు వెళ్లి వచ్చి సెట్స్ లో మళ్లీ అడుగు పెట్టారు. కచ్చితంగా అనుకున్న డేట్ కే సినిమాను రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యి మూవీ టీమ్ కు సపోర్ట్ చేస్తున్నారు. అయితే ఈ మూవీ తర్వాత బన్నీ.. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో వర్క్ చేయడం దాదాపు ఫిక్స్ అయినట్టే. గత ఏడాది బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ నటించిన జవాన్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు అట్లీ. ఇక అల్లు అర్జున్ తో మూవీ చేసి పాన్ ఇండియా లెవెల్ హిట్ అందుకోవాలని చూస్తున్నారు. అయితే ఈ సినిమా విషయంలో నిర్మాత అల్లు అరవింద్ తో అట్లీ పలుమార్లు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. కానీ ప్రాజెక్ట్ పై ఇంకా ఏదీ ఫైనల్ కాలేదట. ఈ సినిమా విషయంలో అట్లీ కొన్ని కండీషన్లు పెట్టినట్లు టాలీవుడ్ లో టాక్ వినిపిస్తోంది. జవాన్ సినిమాకు గాను అట్లీకి భారీ రెమ్యునరేషన్ తో పాటు లాభాల్లో కూడా షేర్ అందిందట. ఇప్పుడు అల్లు అర్జున్



ప్రాజెక్ట్ కు కూడా అలానే అడుగుతున్నారట. పారితోషికం తో పాటు థియేట్రికల్ బిజినెస్ లో షేర్ కూడా కావాలని అంటున్నారట. అయితే ప్రాఫిట్ షేర్ ఓకే గానీ.. రెమ్యునరేషన్ తగ్గించమని అల్లు అరవింద్ అడుగుతున్నారట. ఇప్పుడు వీరి మధ్య డీల్ ఫిక్స్ అవ్వడమే లేట్.. అనౌన్స్మెంట్ వచ్చేయనుందట. ంశ్రీబనీ ఖీవజీట – టాలీవుడ్ పాన్ ఇండియాలు.. ఈ డేట్లు మారకుంటే బాగుండు! అంతా ఓకే అయితే.. అల్లు అర్జున్ బర్త్ డే అంటే ఏప్రిల్ 8వ తేదీన ఈ ప్రాజెక్ట్ పై అధికారిక ప్రకటన రానుందట. ఈ సినిమాతో అట్లీ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. బన్నీతో భారీ యాక్షన్ మూవీ తెరకెక్కించాలని ఫిక్స్ అయ్యారట. తెలుగు, తమిళం, హిందీ నిర్మాతలు కలిసి ఈ సినిమాను నిర్మించనున్నారట. ఈ సినిమాలో హీరోయిన్ గా పొడుగు కాళ్ళ సుందరి పూజా హెగ్డే ఛాన్స్ కొట్టినట్లు సమాచారం. ఇప్పటికే పూజా హెగ్డే.. అల్లు అర్జున్ తో కలిసి దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురములో సినిమాల్లో యాక్ట్ చేసింది. మరోసారి అట్లీ మూవీలో బన్నీ, పూజ జోడీగా నటించనున్నారట. అట్లీతో మూవీ తర్వాత స్టార్ డైరెక్టర్లు త్రివిక్రమ్, బోయపాటి శ్రీనుతో బన్నీ సినిమాలు చేయనున్నట్లు తెలుస్తోంది. మరి అల్లు అర్జున్ కొత్త సినిమా ప్రకటన ఎప్పుడు వస్తుందో వేచి చూడాలి.

## ఐపీఎల్ ఫ్రాంచైజీలతో 16న బీసీసీఐ కీలక సమావేశం.. మెగా వేలంపై ప్రత్యేక చర్చ..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఎఖఒ) 2024 సీజన్ మొదలవగా.. ఇప్పటి వరకు 13 మ్యాచులు ముగిశాయి. టోర్నీలో పాల్గొన్న పది ఫ్రాంచైజీల యాజమానులతో భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రత్యేక సమావేశానికి పిలుపునిచ్చింది. ఈ సమావేశం ఈ నెల 16న అహ్మదాబాద్‌లో జరుగనున్నది. అదే రోజు నరేంద్ర మోదీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ ? గుజరాత్ టైటన్స్ మధ్య మ్యాచ్ జరుగనున్నది. ఈ సమావేశానికి ఐపీఎల్ జట్ల యజమానులతో పాటు సీఈఓలు, ఆపరేషనల్ బృందాలను సైతం సమావేశానికి పిలిచే అవకాశం ఉందని సమాచారం.కీలక సమావేశానికి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్ సైతం హాజరవనున్నారు. సమావేశానికి ఐపీఎల్ సీఈవో హేమాంగ్ అమిన్ ఆహ్వానం పంపినట్లు విశ్వసనీయ సమాచారం. మెగా వేలానికి ముందే పాలసీలకు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే, ఫ్రాంచైజీలకు పంపిన ఆహ్వానంలో ఎజెండాను మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. హఠాత్తుగా ఏర్పాటు చేసిన సమావేశంలో.. వచ్చే ఏడాది జరుగనున్న మెగా వేలం జరుగనున్నది. ఇందుకు సంబంధించి బీసీసీఐ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది

# అక్కినేని హీరో సరసన బుట్టబొమ్మ?

రంగుల ప్రపంచంలో ఎగుడు దిగుడు ప్రయాణం ప్రతి ఆర్టిస్టుకు అనుభవ పాఠమే. అలాంటి పాఠాలెన్నో నేర్చుకుంది పూజా హెగ్డే. మొదటి సినిమాలో నటించాక దశాబ్ధం పాటు మంచి అవకాశం కోసం వేచి చూసింది. తమిళంలో జీవా సరసన నటించన ఈ బ్యూటీకి మళ్లీ సౌత్ లో పెద్ద అవకాశం రావడానికి పదేళ్లు పట్టింది. అయితే వరుణ్ తేజ్ ముకుంద, నాగచైతన్యతో ఒక లైలా కోసం సినిమాల్లో ఒకేసారి అవకాశాలు అందుకుంది. ఆ తర్వాత కథంతా తెలిసిందే. పూజా హెగ్డే టాలీవుడ్ లో అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకుంటూ టాప్ హీరోయిన్ గా ఎదిగింది



కొన్నేళ్ల పాటు కాల్షీట్లు ఇవ్వలేని పరిస్థితి. కానీ ఉన్నట్టుండి ఆ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. వరుసగా పెద్ద హీరోలతో ఫ్లాపులు రావడం ఈ అమ్మడిని చికాకు పెట్టింది. ప్రస్తుతం బాలీవుడ్‌లోను పరిమిత ఆఫర్లే ఉన్నాయి. మరోవైపు సౌత్ లోకి నెమ్మదిగా కంబ్యాక్ కోసం ప్రయత్నిస్తోంది. ఇంతలోనే పూజా హెగ్డే అక్కినేని హీరో నాగచైతన్య సరసన అవకాశం అందుకుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. చై ప్రస్తుతం చందు మొండేటి దర్శకత్వంలో 'తండేల్' అనే చిత్రంలో నటిస్తున్నారు. తదుపరి విరూపాక్ష దర్శకుడితో ఓ సినిమా చేయనున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా పూజాకు ఆఫర్ దక్కడం యాధృచ్ఛికం. చాలా కాలంగా టాలీవుడ్ లో కంబ్యాక్ కోసం ప్రయత్నిస్తున్న పూజాకు ఇది సదవకాశం. నాగ చైతన్య – పూజా హెగ్డే 'ఒక లైలా కోసం' (2014) లో ప్రేమికులుగా నటించారు. ఈ జంట ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రశంసలను అందుకుంది. కొంత గ్యాప్ తర్వాత తిరిగి ఈ జోడీని తెరపై చూసే అవకాశం లభించనుంది. విరూపాక్ష తర్వాత మరోసారి ఉత్కంఠ రేకెత్తించే థ్రిల్లర్ మూవీని దర్శకుడు కార్తీక్ దండు తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఈ థ్రిల్లర్‌ను బోగవల్లి ప్రసాద్ – సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల ప్రీప్రొడక్షన్ దశలో ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్ ని రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. పూజా ఎంట్రీ గురించి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# దళపతి.. అటు ఇటు తిరిగి చివరికి అతని వద్దకే..

ఇళయదళపతి విజయ్ రాజకీయాలలోకి వెళ్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తన పార్టీ పేరుని కూడా ఇప్పటికే ఖరారు చేశారు. తమిళంగ వెట్రి కజగం పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. ఆ పార్టీ పేరుతో రాజకీయ ప్రకటనలు కూడా అప్పుడప్పుడు ఇస్తున్నారు. తమిళనాడులో ప్రస్తుతం ప్రాంతీయ పార్టీ డీఎంకే మాత్రమే బలంగా ఉంది. మరోవైపు అన్నా డిఎంకేకి నాయకత్వ సమస్యలో పడింది. దీంతో తమిళనాడులో ఉన్న పొలిటికల్ స్పేస్ ని తాను ఉపయోగించుకోవాలని విజయ్ అనుకుంటున్నారు. అందుకే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలని దృష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేసుకుంటూ వెళ్తున్నారు. పూర్తిగా రాజకీయాలపై



ఫోకస్ పెట్టనున్న నేపథ్యంలో సినిమాలకి స్వస్తి చెబుతున్నట్లు విజయ్ ప్రకటించారు. ఇక చివరగా చేసే సినిమాలు బలంగా ఉండాలని విజయ్ ప్లాన్ చేసుకుంటున్నాడు. ప్రస్తుతం వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ గ్రేట్ అఫ్ ఆల్ టైమ్(ఊాయ) అనే మూవీ చేస్తున్నారు. ఈ సినిమా టైం ట్రావెల్ కథతో తెరకెక్కుతోందని తెలుస్తోంది. మూవీలో విజయ్ రెండు భిన్నమైన పాత్రలలో రెండు టైం లైన్స్ లో కనిపిస్తాడంట. ఈ సినిమా షూటింగ్ మేగ్జిమమ్ చివరి దశకి వచ్చేసింది. విజయ్ కెరియర్ లో కంప్లీట్ గా డిఫరెంట్ జోనర్ లో చేస్తోన్న మూవీ ఇది కావడంతో ఎక్స్ పెక్టేషన్స్ ఎక్కువగానే ఉన్నాయి. దీని తర్వాత మరొక సినిమా మాత్రమే చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో అతని చివరి సినిమా డైరెక్టర్ ఎవరవుతారా అనే ప్రశ్న గత కొంతకాలంగా వినిపిస్తోంది. ఈ టైంలో చాలా మంది దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. తెలుగులో త్రివిక్రమ్ శ్రీనివాస్ పేరు కూడా వినిపించింది. అలాగే మరికొందరి పేర్లు ప్రముఖంగా చర్చకి వచ్చాయి. అయితే ఇప్పుడు విజయ్ ఆఖరి సినిమా డైరెక్టర్ కన్ఫర్మ్ అయ్యాడంట. హెచ్ వినోత్ దర్శకత్వంలో విజయ్ చివరి మూవీ చేయబోతున్నాడంట. చాలా కాలంగా ఈ దర్శకుడు విజయ్ తో వర్క్ చేయాలని చూస్తున్నాడు. గత ఏడాది కూడా రెండు కథలు వినిపించగా విజయ్ పెద్దగా ఆసక్తి చూపలేదట. వినోత్ అజిత్ తో నెర్కొండ పర్వ, వాలిమై సినిమాలు చేసి మంచి హిట్స్ అందుకున్నాడు. రీసెంట్ గా మళ్ళీ అతను చెప్పిన కథ నచ్చడంతో విజయ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడంట. అతను కమర్షియల్ ఎలిమెంట్స్ తో పాటు సోషల్ పాయింట్స్ ను కూడా అద్భుతంగా ప్రజెంట్ చేయగలడు. అందుకే విజయ్ మనసు వినోత్ వైపు యూ టర్న్ తీసుకున్నట్లు టాక్. ఇక ఈ సినిమాపై త్వరలో అఫీషియల్ ఎనౌన్సమెంట్ రానున్నట్లు టాక్ వినిపిస్తోంది. హెచ్ వినోత్ తో మూవీ పూర్తి చేసి వచ్చే ఏడాది నుంచి రాజకీయాలపై విజయ్ దృష్టి పెట్టబోతున్నాడంట. అయితే హెచ్ వినోత్ విజయ్ కోసం ఎలాంటి కథ సిద్ధం చేసి ఒప్పించాడు. ఎప్పుడు ప్రారంభం అవుతుంది, ఎవరు నిర్మిస్తారు అనే వివరాలు పూర్తిగా బయటకి రాలేదు.

# ఒత్తిడితో కడుపునొప్పి సమస్యలు

ఒత్తిడితో గుండె సంబంధ వ్యాధులు, హిస్టీరియా వస్తాయని విన్నాంకాని? ఒత్తిడికీ, పొట్టకి ఏంటి సంబంధం అనుకుంటున్నారా? సంబంధం ఉంది. మెదడు నుండి పొట్టలోకి ఒక నరం ప్రవహిస్తూ ఉంటుంది. కోపం లేదా ఆందోళనగా ఉన్నపుడు ఈ నరం ఆ ప్రభావాల్ని పొట్టలోకి చేరుస్తుంది. ఇవి జీర్ణక్రియలో తోడ్పడే ప్రత్యేకమైన కణాలను ప్రభావితం చేసి, జీర్ణరసాయనాలు ఎక్కువ మోతాదులో విడుదలయ్యేలా చేస్తాయి. దీనివల్ల పొట్టలో నొప్పి, గ్యాస్, జీర్ణం కాకపోవడం, అసిడిటి లాంటి సమస్యలు తరచుగా తలెత్తుతుంటాయి. అనుభవజ్ఞులైన వైద్యులకు మీ సమస్య ఏంటో ఇట్టే అర్థమవుతుంది. అందుకే సమస్య ఏమీ లేదు ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించండి అంటూ వైద్యులు సలహా ఇస్తారు. లగ్నం చేయండి. మీరు చేసేది కరెక్టే అయి నపుడు ఆందోళన పడాల్సిన పని లేదు కదా! ఆందోళన లేనపుడు మీ మెదడు అనవసర విషయాలతో, అవిశ్రాంతంగా, ఒత్తిడిగా, నిస్సత్తువగా లేకుండా ప్రశాంతంగా, చురుకుగా ఆలోచించగ లుగుతుంది. ఆఫీసులో అయినా, ఇంట్లో అయినా ఇదే విధానం పనిచేస్తుంది. ఈసారి పొట్టకు సంబంధించిన సమస్యలు తలెత్తినపుడు వెంటనే డాక్టర్ దగ్గరికి పరిగెత్తకుండా ఇలా చేసి చూడండి. తర్వాత అవసరమైతే డాక్టర్ని సంప్రదించవచ్చు. ప్రశాంతత? ప్రశాంతత రోడ్డుమీద నడిచేటపుడు, ట్రాఫిక్‌లో, మీ చుట్టూ ఉన్న వాతావర ణాన్ని చూసి ఆందోళన పడకండి. నీలివర్ణపు ఆకాశాన్ని చూడండి. గాలికి ఊగుతున్న పువ్వులను, ఆకులను గమనించండి. మీ చుట్టూ పరు చుకుని ఉన్న ఆకుపచ్చ, ఎరుపు, పసుపు? లాంటి రంగుల వస్తువు లను పరీక్షించండి. మీ చుట్టూ ఉన్న ప్రకృతిని గమనించండి. దానిని ఆస్వాదించండి. ఉదర సమస్యలు మిమ్మల్ని బాధిస్తే అపుడడగండి. రసాయన చికిత్స మీకు వైద్యులు ఇచ్చిన చీటీలోని మందులు కొనేముందు ఒక్క నిమిషం ఆగండి. ఉత్సాహంగా ఉండే వ్యాఖ్యానాలు మీ మీద మీరే ప్రయోగించుకుని చూడండి. 'ఈ రోజు చాలా మంచిరోజు 'ఈ రోజు నేను ఎంతో స్నేహంగా అందరితోనూ మెలగుతాను అందరితోనూ 'మనసువిప్పి మాట్లాడతాను, 'అవసరమైన సందర్భాల్లో జాలి, కరుణ చూపిస్తాను లాంటి ఉత్సాహపూరిత మైన మాటలు అనుకోండి. దీనివల్ల మెదడులో కొన్ని రకాల రసాయన చర్యలు జరుగుతాయి. వీటిలో ఉత్పన్నమయ్యే రసాయనాలు మందులు వాడకుండానే మీ సమస్యలను దూరం చేస్తాయి. రెండు పనులూ ఒకేసారి ఒకోసారి మీరు చేయాల్సిన పని ఎక్కువగానే ఉంటుంది. అలాగే విశ్రాంతి తీసుకోవడమూ అవసరమే. మానసికంగా ప్రశాంతంగా ఉండడమే విశ్రాంతి కాబట్టి పనిచేసుకునే సమయంలోనే మంద్రస్థాయిలో మంచి సంగీతాన్ని వినండి. అలాగే రెండు మూడు పనులు ఒకేసారి కాకుండా ఒకేపని మీద మీ దృష్టి కేంద్రీ కరించండి. దీనివల్ల ఆందోళన లేకుండా, తక్కువ సమయంలో ఎక్కువ పనులు అయ్యే అవకాశం ఉంది. ఆందోళన లేదు కాబట్టి ఉదర సంబంధ సమస్యలూ ఉండవు. ఆత్మ పరిశీలన మొబైల్ స్విచ్‌ఆఫ్ చేయండి, కంప్యూటర్ షట్‌డౌన్ చేసి మిమ్మల్ని మీరు నిజాయితీగా శోధించుకోండి. మీరు చేస్తున్న పనిమీద మీకు ఎంత వరకు ఏకాగ్రత ఉంది. మిమ్మల్ని మీరు ఆ పనికి తగిన శక్తిసామర్థ్యాలు ఉన్న వ్యక్తిగా నమ్ముతున్నారా? ఉద్యోగంలోకానీ, ఇంట్లో కానీ మీరే కీ పర్సన్‌గా భావిస్తున్నారా? ఇలా ఆలోచిస్తున్న సమయంలో కాఫీ, టీలకు బదులు చల్లని పాలు తాగండి. మీ పిల్లలు, భర్త, బంధువులు, స్నేహితులు మిమ్మల్ని, మీరు చేసే పనిని సరిగా అర్థం చేసుకోవడంలేదని వారిపట్ల కఠినంగా ఉంటున్నారా ఆలోచించండి. అలాగే మిగతా వారికంటే ఎక్కువ శ్రమిస్తున్నా ఫలితం దక్కడం లేదని బాధపడేవారి విషయంలోనూ ఇది వర్తిస్తుంది. పూర్తి అవగాహనతో పనిచేసుకుంటూ వెళుతున్న వారిని ఉదర సంబంధ సమస్యలు బాధించిన సంఘటనలు చాలా తక్కువ. ఆ పనిలో వారు ఆనందం పొందలేకపోయినా, ఆనవసరపు ఆందోళనతో కోల్పోయేది ఏమీ లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వారిని బాధించవు. మన శారీరక ఆరోగ్యం మన మానసిక స్థితి మీదే ఆధారపడి ఉంటుంది. మన చుట్టూ ఉన్న వాతావరణంలో ఇలాంటి పరిస్థితులు ఉంటే మనం వాటిని పట్టించుకోకపోయినా వాటి ప్రభావం పొట్ట మీద ఉంటుంది. మన సబ్ కాన్షియస్ మైండ్(అంతఃశ్చేతన)లో ఉన్న ఈ ప్రభావాలు ఉదరసంబంధ సమస్యలకు దారితీస్తాయి.

# మండుటెండల్లో మెగాస్టార్ కష్టాలు...!



మెగాస్టార్ చిరంజీవి మొన్నటి వరకు విశ్వంభర సినిమా షూటింగ్ లో పాల్గొన్నాడు. ఎండలు మండుతున్న నేపథ్యంలో చిరంజీవి వేసవి పూర్తి అయ్యే వరకు విశ్వంభర కు బ్రేక్ ఇవ్వచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. కానీ చిరంజీవి మాత్రం ఎండలను లక్ష్య పెట్టకుండా మళ్లీ షూట్ కి రెడీ అయ్యారు. నేటి నుంచి విశ్వంభర సినిమా షూటింగ్ కొత్త షెడ్యూల్ ను ప్రారంభించారు. హైదరాబాద్ లో అత్యంత కీలక సన్నివేశాల చిత్రీకరణకు యూనిట్ సభ్యులు సిద్ధం అయ్యారు. ఇప్పటికే షూటింగ్ రెండు షెడ్యూల్ పూర్తి చేసిన దర్శకుడు వశిష్ఠ ఈ షెడ్యూల్ లో టాకీ పార్ట్ ను మరియు ఒక యాక్షన్ సన్నివేశాన్ని షూట్ చేస్తున్నాడట.చిరంజీవితో పాటు కీలక పాత్రల్లో నటిస్తున్న నటీ నటులు మరియు హీరోయిన్ త్రిష కూడా పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. యంగ్ హీరోలే ఈ ఎండకు షూటింగ్ అంటే భయపడుతూ ఉన్నారు. వేడి, ఉక్క పోత తట్టుకోలేక విదేశాలకు వెకేషన్ కి వెళ్తున్నారు. అలాంటిది చిరంజీవి ఈ వయసులో మండే ఎండల్లో కష్టపడటం గొప్ప విషయం. చిరంజీవి ఈ షెడ్యూల్ ను పూర్తి చేసిన తర్వాత వేసవి సెలవులు తీసుకుంటారని తెలుస్తోంది. ఫ్యామిలీతో కలిసి యూరప్ కి వెళ్లాలని చిరంజీవి భావించారని, కానీ ఈ షెడ్యూల్ పూర్తి అయితే కీలక సన్నివేశాలు పూర్తి అయ్యి, గ్రాఫిక్స్ వర్క్ జరుగుతాయనే ఉద్దేశ్యంతో కాస్త ఇబ్బంది, కష్టం అయినా కూడా ఎండ వేడికి షూటింగ్ లో పాల్గొంటున్నాడట. బింబిసార సినిమా తర్వాత దర్శకుడు వశిష్ఠ రూపొందిస్తున్న ఈ సినిమా పై మెగా ఫ్యాన్స్ చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. భోళా శంకర్ సినిమా తర్వాత చిరంజీవి కాస్త గ్యాప్ తీసుకుని ఈ సినిమాకు ఓకే చెప్పాడు. 2025 సంక్రాంతికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. హిట్లర్ తరహా లో చిరంజీవి కి ఈ సినిమాలో నలుగురు లేదా అయిదు మంది చెల్లెల్లు ఉంటారని తెలుస్తోంది. హీరోయిన్ గా త్రిష నటించడంతో పాటు ఇంకా మృణాల్ ఠాకూర్ కూడా ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు కూడా వచ్చాయి. ఆ విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

# బుల్లి క్రికెట్ స్టార్ సంచలనం : స్టైలిష్ బ్యాటింగ్‌తో సచిన్ ఫిదా

క్రికెట్‌పై అమ్మాయిలు చూపిస్తున్న ఆసక్తి మహిళా క్రికెట్‌పై ఆశల్ని మరింత పెంచుతోంది. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ క్రికెట్ మహిళలు స్టార్లుగా సత్తా చాటుతున్న నేపథ్యంలో తాజాగా ఒక సంచలన తార అవతరించడం విశేషంగా నిలిచింది.తొమ్మిదేళ్లకే అత్యుత్తమ ప్రతిభతో ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. దిగ్గజాలను సైతం అబ్బుర పరుస్తోంది.ఎడమచేతి వాటంతో బ్యాటింగ్ చేస్తూ, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ను ఆకట్టుకునే స్టైలిష్ బ్యాట్ స్వింగ్‌తో మైదానం నలుమూలలకు బంతిని పరుగులు పెట్టించింది. గొప్ప క్రికెటర్‌గా రాణించాలని కలలు కంటోంది.కశ్మీర్‌లోని సోపోర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలిక హర్మత్ ఇర్షాద్ భట్. సాధారణ డ్రైవర్ కుమార్తె. బుమై (జైంగీర్)లో రెండో తరగతి చదువుతోంది. ఇటీవల ప్లేగ్రౌండ్‌లో అబ్బాయిల టీంతో ఆడుతూ షాట్‌లు కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరలయింది. ఆమె లాంటి పిల్లలు క్రికెట్‌ను ఆస్వాదించడం చూసి తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ ఈవీడియోను రీ–ట్వీట్ చేశాడు. యువత ఆడటం క్రికెట్ ఆడటం చూడటం తనకు చాలా సంతోషినిస్తోందంటూ ట్వీట్‌చేశారు. దీంతో మరింత వైరల్ అయింది. పలువురు ఆమె టాలెంట్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.క్రికెట్ స్టార్లు మిథాలీ రాజ్,శిఖర్ ధావన్ తన ఫ్యావరెట్ అని చెప్పింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడిన మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్‌ని చూసిన తర్వాత క్రికెట్‌పై ఆసక్తిని పెంచుకుందట. అంతేకాదు చాలా కాలంగా ఈ ప్లేగ్రౌండ్‌లో ఆడతానని తన కిష్టమైన షాట్ కవర్ డ్రైవ్ అని, తన తాతయ్యతో కలిసి ఆడేదాన్నని చెప్పుకొచ్చింది. ఉదయం 8 గంటలకు ప్రాక్టీస్ షురూ. జాసిమ్ భట్, అర్సలాన్, ఫైసల్, ఫయీజ్, ఇఖ్లాక్ , ఇతర అబ్బాయిలతో పోటీ పడి ఆడుతుంది."సచిన్ సర్ నా వీడియోను షేర్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను, " హర్మత్.భారత జట్టులోకి ఎంపికై మిథాలీ రాజ్‌తో మ్యాచ్ ఆడాలని హర్మత్ కలలు కంటోంది. ఇక్కడ చాలా టాలెంట్ ఉంది కానీ తగిన గుర్తింపు లభించడం లేదని, శిక్షణకోసం అకాడమీలు లేవంటూ స్థానికులు తౌసీఫ్ అహ్మద్ వ్యాఖ్యానించారు హర్మత్ తరహాలో క్రీడాకారులకు క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరారు.



## మల్కాజ్గిరి పార్లమెంట్ మరోసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరిన మైనంపల్లిహనుమంతరావు




**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** అల్వాల్ ప్రజా సమస్యలు తీర్చడంలో తను ఎప్పుడు ముందుంటానని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం అల్వాల్ పరిధిలోని పంచశీల కాలనీ లో మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ మైనంపల్లి హనుమంతరావు తో కలిసి సునీత మహేందర్ రెడ్డి కాలనీ వాసుల తో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్కాజ్గిరి పార్లమెంట్లో మరోసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని ఆమె గుర్తు చేశారు. ప్రతి సమస్యను తన ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ దేవుళ్ళని అడ్డం పెట్టుకొని తాము రాజకీయాలు చేయమని బిజెపి పార్టీ ఉద్దేశించి అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని మైనంపల్లి కోరారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## జహీరాబాద్ పార్లమెంట్ లోని అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ క్రియాశీల కార్యకర్తల సమావేశం....

**ఆందోల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):**-ఆందోల్ నియోజకవర్గం లోని టేక్మాల్ మండలంలోని పలు గ్రామాల వివిధ పార్టీల నాయకులు ప్రజలు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు టేక్మాల్,చల్లపల్లి,కోరంపల్లి,బొడ్మట్ పల్లి,కమ్మరికత్త,దాదాయపల్లి,తంప్లూర్,ధన్నారం,ఎల్లానప్పుర్,నారంపల్లి, గ్రామాలకు చెందిన 100 మంది కార్యకర్తలు ఎంపీ బీబీ పాటిల్ గారిని కలిసి మాట్లాడారు బీజేపీ మండల అధ్యక్షులు నవీన్ మాజీ మండల అధ్యక్షులు రాజు మండల ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు, రాములు ఉపాధ్యక్షులు వడ్డె రాములు,అంబయ్య, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్టి మోర్చా అధ్యక్షులు సేనాపతి, యువ మోర్చా అధ్యక్షులు పవన్ గారి సమక్షంలో కండువా కప్పుకొని పార్టీలో చేరారు.



## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను, కార్యకర్తలను గుర్తించాలి

### : యూత్ కాంగ్రెస్ హత్నూర మండల అధ్యక్షుడు వరిగుంతం కృష్ణ



**ఆందోల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):**-కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ కోసమే కష్టపడి పనిచేసిన పార్టీ నాయకులను, కార్యకర్తలకు పార్టీలో అవకాశాలు కల్పించి, పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు సరైన గుర్తింపుని ఇవ్వాలని యువజన కాంగ్రెస్ హత్నూర మండల అధ్యక్షుడు వరిగుంతం కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలల నుండి టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడం కోసం అనేకమంది నాయకులు ముందుకు వస్తున్నారని, ఇదే సమయంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేనప్పుడు కష్ట కాలంలో పనిచేసిన పార్టీ నాయకులు ,కార్యకర్తలను గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. అయితే టిఆర్ఎస్ సీనియర్ నాయకులు తమ ఆస్తులను కాపాడుకోవడం కోసం ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరడం అనేది జరుగుతుందని, అధికారం ఎక్కడుంటే అక్కడ వెళ్లే మనస్తత్వం ఉన్నవారు పార్టీలోకి వస్తే, పార్టీ కోసం పగలనక, రేయనక కష్టపడిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు నష్టం చేకూరుతుందని, ఎలాంటి నష్టం వాటిల్లకుండా పార్టీ నాయకులను కార్యకర్తలను గుర్తించాలని ఆయన అన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేసిన చాలామంది నాయకులు కార్యకర్తలు పార్టీ కోసం పార్టీ ,అధికారంలోకి రావడం కోసం చాలా ప్రయత్నాలు చేశారు. అందుకనే ప్రతి కార్యకర్తను గుర్తు ఎరిగి పాత కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వాలని పార్టీ అధినాయకత్వాన్ని కోరుతున్నానని అన్నారు.

# హైదరాబాద్‌లో "వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్" సదస్సును నిర్వహించనున్న బిట్స్ పిలానీ విల్ప్ (డబ్ల్యూఐఎల్పి)

**శ్రీ ప్రస్థానం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ; హైదరాబాద్, ఇండియా,మార్చి 30,** 2024: బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఑ సైన్స్ (బిఐటిఎస్) పిలానీ యొక్క వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ (డబ్ల్యూఐఎల్పి) విభాగం ఏప్రిల్ 15 మరియు 16, 2024 న తమ హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ (ఐసిఓఎన్ డబ్ల్యూఐఎల్-2024)ని నిర్వహించనుంది. "వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్" యొక్క క్లిష్టమైన మరియు నిర్దిష్ట డొమైన్‌లో భవిష్యత్తు కోసం నిర్మాణాత్మక దిశలను అభివృద్ధి చేయడంపై విస్తృతమైన దృష్టితో సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పండితులు, అభ్యాసకులు మరియు విధాన రూపకర్తలను ఒకచోట చేర్చడం పై దృష్టి సారించింది. తమ పరిశోధనా ఫలితాలు మరియు వినూత్న ఆలోచనలను పరస్పరం మార్చుకోవడం, విభిన్న అంశాలలో ఉత్తమ అభ్యాసాలు, అనుభవాలు మరియు పరిజ్ఞానం పంచుకోవడం మరియు బోధన మరియు అభ్యాసం రంగంలోని నిపుణులు ఎదుర్కొనే వివిధ ఆచరణాత్మక సవాళ్లకు పరిష్కారాలను చర్చించడం వంటి ఆలోచనలను రేకెత్తించే ఉమ్మడి వేదికను అందించడం దీని లక్ష్యం. భారత ప్రభుత్వం యొక్క అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) చైర్మన్ ప్రొఫెసర్ (డాక్టర్ ) టి జి సీతారాం, ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని బిట్స్ పిలానీ చేసిన ఆహ్వానాన్ని మన్నించారు.కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు మరియు పేపర్ మరియు కేస్ స్టడీ ప్రెజెంటేషన్‌లను ఆకర్షించడంఈ సదస్సు లో విద్యా రంగం మరియు పరిశ్రమల నుండి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఆలోచనా నాయకులచే కీలక ప్రసంగాలు మరియు ప్యానెల్ చర్చలు (వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ స్పేస్‌లో సమకాలీన అంశాలపై) ఉంటాయి. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రముఖ వక్తలలో ప్రొఫెసర్ మను కపూర్,ఇటిఎచ్ జూరిచ్, ప్రొఫెసర్ డానియల్ జోనాథన్ బెర్న్‌స్టెయిన్, ప్రొఫెసర్-ఎమిరిటస్, కాన్సాస్ విశ్వవిద్యాలయం, యుఎస్ఏ , ప్రొఫెసర్ నెల్సన్ లేసీ, ప్రొఫెసర్-ఎమెరిటస్, యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, డాక్టర్ లక్ష్మీనారాయణన్ సామవేదం, అసోసియేట్ ప్రొఫెసర్ , సింగపూర్ విశ్వవిద్యాలయం , డాక్టర్ ఎడమన ప్రసాద్, ప్రొఫెసర్ , ఐఐటి-మద్రాస్ , శ్రీ పిబి కోటూర్, ఇంజినీరింగ్ అకాడమీ గ్లోబల్ హెడ్ , ఎల్ అండ్ టి టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ వున్నారు. ఈ సదస్సులో ఐదు ఆకర్షణీయమైన అంశాలపై పరిశోధకులు మరియు అభ్యాసకుల నుండి పేపర్ మరియు కేస్ స్టడీ ప్రెజెంటేషన్‌లు ఉంటాయి, ఈ అంశాలలో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ కోసం భవిష్యత్ దిశల పై అంచనాలు , బోధనా పద్ధతులు, అంచనా నమూనాలు, ఆవిష్కరణ మరియు అభ్యాస సాంకేతికతలు మరియు పరిశ్రమ-విద్యా సహకారం ఉంటాయి.టెక్-పవర్డ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ సొల్యూషన్స్ షోకేస్ మరియు హ్యాండ్స్ -ఆన్ వర్క్‌షాప్‌కాన్ఫరెన్స్‌లో భాగంగా "వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్" కోసం టెక్-పవర్డ్ సొల్యూషన్స్‌పై దృష్టి సారించే విద్యార్థుల పోటీ, "ఎడ్యుఫోర్జ్" కూడా నిర్వహించబడుతుంది. విద్యార్థుల అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడంలో సహాయపడే వినూత్న సాంకేతిక పరిష్కారాలను మెరుగు పరచడానికి, రూపకల్పన చేయడానికి, అభివృద్ధి చేయడానికి మరియు ప్రదర్శించడానికి పోటీలో పాల్గొనేవారిని ఇది సవాలు చేస్తుంది. పాల్గొనేవారు తమ ఆవిష్కరణలను ఐదు విభిన్న ట్రాక్‌లలో ప్రదర్శించడానికి అవకాశాలను కలిగి ఉంటారు, అంటే ఎఐ- అనుసంధానిత వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్, అనుభవపూర్వక అభ్యాసానికి వినూత్న పరిష్కారాలు, టెక్-ఎనేబుల్డ్ స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ మరియు పీర్ లెర్నింగ్, టెక్-ఎనేబుల్డ్ అసెస్‌మెంట్ మరియు టెక్-ఎనేబుల్డ్ స్టూడెంట్ సపోర్ట్ సిస్టమ్. టీచింగ్ మరియు లెర్నింగ్‌లో జెనరేటివ్ ఎఐ ని (పని ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్‌లో ప్రాక్టికల్ యూజ్ కేసులపై నిర్దిష్ట దృష్టితో) పెంపొందించడంపై హ్యాండ్-ఆన్ వర్క్‌షాప్ కూడా ఉంటాయి. స్పాందా ఎఐ, యుఎస్ఎ సహ వ్యవస్థాపకుడు మరియు చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, శ్రీ కేశవ రంగరాజన్ ద్వారా సత్కారం చేయబడుతుంది.

# బీద బిడ్డల అభ్యున్నతి కోసం పార్లమెంట్ కు పంపాలి...

### అడియో ఆవిష్కరణలో నల్గొండ గద్దర్...




**శ్రీ ప్రస్థానం న్యూస్ పటాన్చెరు** ప్రతినిధిరాజకీయాల్లో మచ్చలేని చంద్రుడు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అని ప్రముఖ సింగర్ నల్గొండ గద్దర్ అన్నారు.పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం నీలం మధు ముదిరాజ్ పై నల్గొండ గద్దర్ రాసిన పాటకు సంబంధించిన సీడీ ని హైదరాబాదులో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నల్గొండ గద్దర్ మాట్లాడుతూ బడుగు జీవుల అభ్యున్నతి కోసం పార్లమెంటులో గల మెత్తగా అంటే మన బీసీ బిడ్డ నీలం మధు ముదిరాజును పార్లమెంటుకు పంపాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. గత కొన్ని ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బీద ప్రజలకు అండగా నిలబడుతున్న నీలం మధు లాంటి నాయకుడు పార్లమెంటుకు వెళ్తే ప్రజల తరఫున గొంతెత్తి మన హక్కులను సాధించుకోవచ్చు అన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఓటర్లంతా విజ్ఞతతో ఆలోచించి మన ఇంటి బిడ్డ నీలం మద్దు ముదిరాజ్ కి ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# కొనసాగుతున్న బంగారం పరుగులు



ముంబై, ఏప్రిల్ 1 అత్యంత విలువైన లోహాలలో ఒకటైన బంగారం ధరల మారథాన్ కొనసాగుతూనే ఉంది. ఎల్లో మెటల్ అద్భుతమైన ర్యాలీతో కొత్త ఆర్థిక సంవత్సరాన్ని ప్రారంభించింది, సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ రోజు, 01 ఏప్రిల్ 2024న, అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు కొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ ప్రభావంతో మన దేశంలోనూ పసిడి నగలు ప్రజల కళ్లు బైర్లు కమ్మేలా ప్రకాశిస్తున్నాయి.2024-25 ఆర్థిక సంవత్సరం తొలి రోజైన సోమవారం, అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఔన్స్‌కు రికార్డు స్థాయిలో 2,281.60 డాలర్లకు చేరుకున్నాయి. జు ట్రేడ్ ప్రారంభంలో ఔన్సుకు దాదాపు 2,233 డాలర్ల వద్ద ప్రారంభమైన ఎల్లో మెటల్, అతి తక్కువ సమయంలోనే కొత్త రికార్డు స్థాయికి ఎగబాకింది.అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన బూమ్ ప్రభావం దేశీయ మార్కెట్‌లోనూ కనిపిస్తోంది. ఓఅచీలో బంగారం ధర ఈ రోజు బిజినెస్ ప్రారంభమైన వెంటనే పెరిగింది. ఓపెనింగ్ సెషన్‌లోనే అది కొత్త రికార్డు స్థాయిని తాకింది. ఇంట్రాడేలో, ఓఅచీలో ఏప్రిల్ గోల్డ్ కాంట్రాక్ట్ 10 గ్రాములకు రూ. 69,487 స్థాయికి చేరుకున్నాయి. మన దేశ చరిత్రలో, 10 గ్రాములకు ఇదే అత్యధిక స్థాయి. అదే సమయంలో, జూన్ కాంట్రాక్ట్ ధర 10 గ్రాములకు రూ. 68,719 కు పెరిగింది.ప్రస్తుతం, హైదరాబాద్ , విజయవాడ మార్కెట్లలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.63,600 వద్దకు చేరింది. 24 క్యారెట్ల బంగారం ధర రూ.69,380 దగ్గర ఉంది. 18 క్యారెట్ల బంగారం ధర రూ.52,040 పలుకుతోంది. కిలో వెండి ధర హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో ? 81,600 కతు చేరింది. విజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర ? 63,600 వద్దకు; 24 క్యారెట్ల బంగారం ధర ? 69,380 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర ? 52,040 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర ? 81,600 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది. స్వర్ణం ధరలు పెరగడం ఆకస్మికంగా జరిగింది కాదు. సాంప్రదాయకంగా, బంగారం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదార్లకు ఇష్టమైన మార్గం. ఆర్థిక అనిశ్చితి పెరిగినప్పుడు, సేఫ్ హెవెన్ అయిన పసిడి డిమాండ్ పెరుగుతుంది. ప్రపంచ పెట్టుబడిదార్లు పసుపు లోహాన్ని సురక్షితమైన పెట్టుబడుల్లో ఒకటిగా భావిస్తారు. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు లేదా ఇతర కారణాల వల్ల ఆర్థిక పరిస్థితి అనిశ్చితంగా మారినప్పుడల్లా, గ్లోబల్ ఇన్వెస్టర్లు బంగారం వెంట పరుగెత్తడం ప్రారంభిస్తారు.ప్రస్తుతం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు చాలా ఎక్కువగా ఉన్నాయి. తూర్పు ఐరోపాలో రష్యా - ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ఇప్పట్లో ముగిసే సంకేతాలు లేవు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత పశ్చిమాసియాలో ఉద్రిక్తత నిరంతరం పెరుగుతోంది. వీటితో పాటు, జూ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ నుంచి వచ్చిన సంకేతాలను బట్టి కూడా బంగారం ధరలకు మద్దతు లభించింది.ఈ క్యాలెండర్ ఇయర్‌లో వడ్డీ రేట్లలో మూడు కోతలు ఉంటాయని ఫెడరల్ రిజర్వ్ హింట్ ఇచ్చింది. వడ్డీ రేట్లు తగ్గితే బాండ్ రాబడులు తగ్గుతాయి. ఈ నష్టం నుంచి సంపదను కాపాడుకోవడానికి పెట్టుబడిదార్లు ప్రత్యామ్నాయ మార్గాల కోసం వెతకడం ప్రారంభిస్తారు. సాధారణంగా, ఈ వెదుకులాటలో స్వర్ణం ఎక్కువ ప్రయోజనం పొందుతుంది.

## రాష్ట్రంలో రోజు రోజుకి రైతుల కష్టాలు పెరుగుతున్నాయి

హైదరాబాద్,రాష్ట్రంలో రోజురోజుకి రైతుల కష్టాలు పెరుగుతున్నాయని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రైతు ఆత్మహత్యలు బాగా పెరిగాయి. వ్యవసాయ పెట్టుబడి లేక ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే ఈ పరిస్థితులు వచ్చాయి. అన్నదాతల ఆవేదన ఆక్రనందన బిన్న రూపాల్లో వ్యక్త పరుస్తున్నారు. రైతులు కంటతడి పెడుతున్నారు. అనవసరంగా కాంగ్రెస్ కు ఓటు వేశామని బాధ పడుతున్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులను పట్టించుకోకుండా ఇతర పార్టీల నాయకులకు కండువాలు కప్పే ఉన్న పనిలో ఉన్నారు.

## కంటైనర్ ముందు టైరు బ్లాస్ట్...... వెనకాల నుండి లారీ డీ.....



**ఆందోల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):**-ఆందోల్ నియోజకవర్గం లోని అల్లాదుర్గ ంమండలం చిల్వర గ్రామ సమీపంలో 161జాతీయ రహదారిపై సోమవారంరోడ్డు ప్రమాదం జరిగింది. నారాయణఖేడ్ నుండి హైదరాబాద్ వెళ్తున్నకంటైనర్ దాని వెనకాలే ఉన్న లారీ కూడా రెండు ఈ రహదారి గుండావెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా కంటైనర్ ముందు టైర్ బ్లాస్ట్ కావడంతోవెనకాలే ఉన్న లారీ డ్రైవర్ సడన్ గా బ్రేక్ వేయడంతో లారీ కంట్రోల్ కాకకంటైనర్ ను ఢీ కొట్టింది ఈ ఘటనలో లారీ డ్రైవర్ అరగంట పాటుక్యాబిన్లోని ఇరుక్కుపోయి నరకయాతులు అనుభవించాడు.విషయంతెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగాశ్రమించి పోలీసులు స్థానికుల సహాయంతో లారీ డ్రైవర్ విజయ్ కుమార్‌ను బయటకు తీశారు ఈ క్రమంలో అటువైపుగా వెళ్తున్న జహీరాబాద్‌బిజెపి పార్టీ ఎంపీ బీబీ పటేల్ ఘటన స్థలానికి వెళ్లి అక్కడ ఉండిఅధికారులను తో మాట్లాడి అక్కడ ఉన్న ట్రాఫిక్ ని క్లియర్ చేయించాడుశ్వేతగాత్రుడు విజయ్ కుమార్ కు మనోధైర్యం ని చెప్పి 108 వాహనంలోఆసుపత్రికి తరలించారు వారికి మెరుగైన వైద్యం అందించాలనిఅధికారులను సూచించినట్లు స్థానికులు తెలిపారు.

## మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తనయుడు పీ వీ ప్రభాకర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన టీ వై జే ఎఫ్ సంఘం సభ్యులు




**శ్రీ ప్రస్థానం ప్రతినిధి చింతా శ్రీనివాస్**తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి వై జె ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు ఆహ్వానం మేరకుమాజీ భారత ప్రధాని పివి నరసింహారావు కు భారత రత్న అవార్డు. రావడం పీవీ నరసింహారావు తనయుడు పివి ప్రభాకర్ రావు భారతరత్న అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా పీ వీ ప్రభాకర్ రావు గారిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసిన టి వై జే ఎఫ్ సంఘం సభ్యులు

## జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొనరు.

**ఆందోల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):**-లోక్సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జహీరాబాద్ లోని ఫ్రెండ్స్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం లో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గారు, శాసనసభ్యులు మదన్ మోహన్ రావు, సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లు గిరిధర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు, మైనారిటీ నాయకులు, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం జహీరాబాద్ లోని మైనారిటీ నాయకులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757